ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 మహబూబాబాద్
ఆదివారం 30 జూన్ 2024





నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం

- ఇందుకు రూ.6,115కోట్లు అవసరమని అంచనా
- రింగ్ రోడ్డు, మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ చేపట్టండి
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ సిద్ధం చేయాలి
- నిమ్స్ తరహాలో ఎంజీఎంలో ఎన్‌వోసీల అమలుకు యోచన
- నగరాభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వివిధ శాఖల అధికారులకు దశ దిశా నిర్దేశం
- నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం విస్తృత పర్యటన

సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు

హనుమకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని, నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా మరో విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ దిశగా తానే స్వయంగా ప్రత్యేక దృష్టి పెడతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వచ్చిన ఆయన మధ్యాహ్నం 01.10 గంటకు హెలికాప్టర్‌లో గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ ఫ్యాక్టరీకి చేరుకున్నారు. ఆ తర్వాత వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించి.. హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ నగరాభివృద్ధికి సంబంధించిన ఎనిమిది అంశాలపై మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా అన్ని విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగర సమస్యలపై ఇంత సుదీర్ఘంగా సమీక్ష జరపడం ఇదే మొదటి సారి. ఈ సందర్భంగా ఆయన రింగ్ రోడ్డు నిర్మాణం, స్మార్ట్ సిటీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మామునూరు విమానాశ్రయం, కాళోజీ కళాక్షేత్రం, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నగర సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎప్పుడైనా తనను కలవవచ్చునని అన్నారు. ఈ క్రమంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య రింగ్ రోడ్డుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రెండు చోట్ల 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి తొలుత సత్వరమే భూసేకరణ చేపట్టాలని, ఆ తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని, వరంగల్ నుంచి ఇతర జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా జాతీయ రహదారుల అనుసంధానాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరంగల్‌లో కాలనీలు మునుగుతున్నాయని, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని, నాలాల ఆక్రమణపై దృష్టి సారించాలని అన్నారు. నాలాల్లో ఇసుక ఎప్పటికప్పుడు తొలగించాలని.. హైదరాబాద్ నగరంలో అవలంబిస్తున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ ప్రయోగించాలని

మిగతా 7వ పేజీలో..



హనుమకొండ హంటర్‌రోడ్డులో మెడికవర్ మల్టీ నేషనల్ ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన హైదరాబాద్ విశ్వనగరంగా గుర్తింపు పొందిందని, ఆ మాదిరిగానే వరంగల్‌నూ రూపుదిద్దుతామన్నారు. ప్రతీ పౌరుడికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, యూనిక్ నెంబరుతో డిజిటల్ కార్డులు ఇచ్చి.. తద్వారా ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స పొందేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఎకో, టెంపుల్ టూరిజం అన్నీ ఒక వరంగల్‌లోనే అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- సీసీఎల్ఏ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్

మహబూబాబాద్, జూన్29 (ఆంధ్రజ్యోతి) : ధరణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూశాఖ సీసీఎల్ఏ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ సూచించారు. హైదరాబాద్ నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మండలాలు, గ్రామాల వారీగా ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి, వాటిని పరిష్కరించాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, మా నుకోట, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- జిల్లాలో 8,870 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 210 కిలోల నల్లబెల్లం, 328 లీటర్ల గుడుంబా స్వాధీనం : ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్



భజనతండాలో గుడుంబాను చూపుతున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 29 : జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించి 8,870 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 210 కిలోల నల్లబెల్లం, 328 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 33 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావరాలపై తెల్లవారుజాము నుంచే పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో గుడుంబా విక్రయించేందుకు ఎక్కడ చోటు లేదన్నారు. ఎవరైనా అక్రమంగా గుడుం బా కాచినా, విక్రయించినా, వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహమ్మారి లాంటి గుడుంబాకు అలవాటుపడి ఎంతోమంది కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుని ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. గుడుంబా రహిత జిల్లా కోసం జిల్లా పోలీసులు అలుపెరగని యుద్ధం ప్రకటిస్తూ ప్రతిరోజు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మహబూబాబాద్ డివిజన్ పరిధిలో ఆరు కేసులు నమోదు చేసి 1570 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, 50 లీటర్ల మద్యం, 60 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. గూడూరు సర్కిల్ పరిధిలో రెండు కేసులు నమోదు చేసి 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 20 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బయ్యారం సర్కిల్ పరిధిలో ఐదు కేసులు నమోదు చేసి 48 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 1400 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. తొర్రూరు సర్కిల్ పరిధిలో 11 కేసులు నమోదు చేసి 130 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 2800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. మరిపెడ సర్కిల్‌లో ఆరు కేసులు నమోదు చేసి 70 లీటర్ల మద్యం, 100 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసనట్లు చెప్పారు. వెరసి మొత్తం 33 కేసులు నమోదు చేసి 328 లీటర్ల మద్యం, 210 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని 8870 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 174 మంది పోలీస్ అధికారులు పాల్గొన్నట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ వెల్లడించారు.

మద్యం మత్తులో హెచ్‌ఎం విధులకు హాజరు?

- కొత్తపల్లిలోని పాఠశాలలో నిలదీసిన గ్రామస్థులు
- వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన స్థానికులు



హెచ్‌ఎం ఈక నారాయణ

కొత్తగూడ, జూన్ 29 : మద్యం మత్తులో పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడిని స్థానికులు నిలదీసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కొత్తపల్లిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తపల్లి గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఈక నారాయణ విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం ఆయన మద్యం తాగి పాఠశాలకు వచ్చారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు నారాయణను నిదీశారు. తాగి స్కూల్‌కు వచ్చి, విద్యార్థులకు పాఠాలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. సమయ పాలన పాటించకుండా బడికి ఆలస్యంగా రాగా, మద్యంతాగి రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపల్లిలోని విద్యార్థులను కొందరు తల్లిదండ్రులు పొగుళ్లపల్లి పాఠశాలకు పంపిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనను స్థానికులు వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది.







సహకార సంఘాలు ఆర్థిక మార్గాలను అన్వేషించాలి..

డీసీసీ బ్యాంకు మహాజన సభలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సభలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 29: డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలోని సహకార సంఘాలు ఆర్థిక బలోపేత మార్గాలను అన్వేషించాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సభలో బ్యాంకు లావాదేవీలు, అప్పులు, రుణాల మంజూరు, రికవరీ, భవిష్యత్తు ప్రణాళికలు, బ్యాంకు టర్నోవర్ లక్ష్యం తదితర అంశాలను ప్రస్తావించారు. మహాజన సభనుద్దేశించి మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయితే సేవల విస్తరణ జరుగుతుందన్నారు. ఫలితంగా నూతనంగా ఏర్పర్చుకున్న ప్రగతి లక్ష్యాల సాధన జరుగుతుందన్నారు. సహకార సంఘాల పరిధిలోని రైతుల అవసరాలే కాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు వ్యాపారాలు నిర్వహిస్తే ఆర్థిక ఫలితాలుంటాయన్నారు. ఎప్పటికప్పుడు ఆర్థికంగా జరుగుతున్న మార్పులను పరిశీలించుకొని ఆ మేరకు ఆయా ప్రాంతాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకొని సంఘాలు వ్యాపారాల నిర్వహణను విస్తరించుకోవాలని సూచించారు. సంఘాలు వ్యాపార నిర్వహణపై దృష్టి పెడితే అనేక మార్గాల్లో ఫలితాలను సాధించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలే కాకుండా గ్యాస్ ఏజెన్సీలు, మాల్స్ నిర్వహణ, జెనరిక్ మెడికల్ షాప్స్, పెట్రోలు పంపులు, ఫంక్షన్ హాల్స్ ఇలా ఎన్నో వ్యాపారానికి అనువుగా ఉంటాయన్నారు. వీటిని పరిశీలించి అధ్యయనం చేసి ప్రారంభిస్తే తప్పక ఫలితాలు ఉంటాయన్నారు. తద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు.

డీసీసీ బ్యాంకు టర్నోవర్ రూ.2200 కోట్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం రూ.1930 టర్నోవర్‌ను సాధించినట్లు చెప్పారు. కమర్షియల్ బ్యాంకులతో పాటు రుణాల మంజూరులో బ్యాంకు పోటీ పడుతుందన్నారు. అన్ని వర్గాల వారికి రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రగతి సాధనలో భాగంగా 50 సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాయని, ఇంత సంఖ్యలో సంఘాలు బలపడడం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జరిగిందన్నారు. సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు బి నుంచి ఏ, ఏ-1 స్థాయికి చేరాయని వివరించారు. అయితే ప్రస్తుతం సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు కూడా తమ ఉన్నతిని పెంచుకొని పోటీతత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా 78,432మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు రవీందర్‌రావు వెల్లడించారు. రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్‌లో మొత్తంగా రూ.522కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు చెప్పారు. బ్యాంకు అధికారుల సమర్పించిన రైతుల రుణమాఫీ వివరాలను ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇందులో లోపాలు తలెత్తితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవీందర్‌రావు స్పష్టం చేశారు.

అనంతరం బ్యాంకు ప్రగతి నివేదికను రవీందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, రవిరాజా, నరేందర్, ప్రదీప్‌చందర్, డీసీసీ బ్యాంకు సీఈవో వాజిర్ సుల్తాన్, డీసీవోలు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు



మాడవీధుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ హన్మంతరావు

వరంగల్ కల్చరల్, జూన్ 29: చారిత్రక ప్రసిద్ధిగాంచిన భద్రకాళి ఆలయ అభివృద్ధి, మాడవీధుల నిర్మాణ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హన్మంతరావు అన్నారు. శనివారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కమిషనర్‌కు ఆలయ అర్చకులు, ఈవో శేషు భారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ గోశాలను సందర్శించి ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహా మండపంలో కమిషనర్ హన్మంతరావుకు ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

అనంతరం రూ.30కోట్లతో భద్రకాళి ఆలయ అభివృద్ధి మాడవీధుల నిర్మాణ పనులపై ఆయన అర్చకులతో చర్చించారు. మాడవీధుల పనులు ప్రారంభం కాగా, భద్రకాళి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను కమిషనర్ హన్మంతరావు పరిశీలించారు. ప్లాన్ ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులు, నిధుల వివరాలతో నివేదిక సిద్ధం చేసి పంపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాడవీధుల పనులను కమిషనర్ పరిశీలించారు. అన్నదాన సత్రం, వేద పాఠశాల భవనాలు, ఆలయానికి సంబంధించిన ఇతర నిర్మాణ పనుల వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎటువంటి రాజీలేకుండా పనులు చేపట్టాలని, మాస్టర్ ప్లాన్ ఆధారంగా పనులు పూర్తయ్యేలా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునిత, మేడారం ఈవో రాజేంద్రం, ఇన్‌స్పెక్టర్లు సంజీవరెడ్డి, అనిల్, ఐఎస్‌పీఆర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ శ్రీరాములు, డీపీఆర్వో కిరణ్మయి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను జోడించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్ కో సీఎండీ రోనాల్డ్ రోస్

హనుమకొండ టౌన్, జూన్29: కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ పిలుపునిచ్చారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో సీఎండీ రోనాల్డ్‌రోస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఉద్యోగి నైపుణ్యత, సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వారధిలా నిలవాలన్నారు. నిబద్ధతతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఈ సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి డిస్కం గురించి రోనాల్డ్‌రోస్‌కు పూర్తిగా వివరించారు. కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో 67 లక్షల వినియోగదారులకు మెరుగైన సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఆపరేషనల్ స్ట్రక్చర్ గురించి ప్రస్తావిస్తూ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డిస్ట్రిబ్యూషన్, సంస్థ మానవ వనరులు, సబ్‌స్టేషన్స్, స్కాడా గురించి వివరించారు. సంస్థను బలోపేతం చేయడంలో భాగంగా కొత్త సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, 33కేవీ ప్రత్యామ్నాయ సరఫరా, పాత సబ్‌స్టేషన్‌ల పునరుద్ధరణ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు మరింత చేరువయ్యేలా ప్రతి సోమవారం సెక్షన్‌ల నుంచి సర్కిల్ కార్యాలయాల వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని సబ్‌స్టేషన్ ఆటోమేషన్ చేపడుతున్నామన్నారు. అనంతరం సీఎండీ రోనాల్డ్ రోస్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, సిజియంలు తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కె.ఎన్.గుట్ట, రవీంద్రనాథ్, ట్రాన్స్ కో సీఈ పుల్లయ్య, రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

అధికారులకు ఆదేశాలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి


టెక్స్‌టైల్ పార్కులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గీసుగొండ, జూన్ 29 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు వంద గజాల స్థలంలో అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును శనివారం సీఎం రేవంత్‌రెడ్డి 50 నిమిషాల పాటు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం టెక్స్‌టైల్ పార్కులోని యంగ్వాన్ కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 01.10 గంటకు చేరుకున్న ఆయన అక్కడి నుంచి బస్సులో కిలోమీటరు దూరంలో ఉన్న కైటెక్స్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి 01.25 గంటలకు చేరుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పార్కు స్థలం మ్యాప్‌తోపాటు ఏర్పాటవుతున్న కంపెనీల వివరాలు, ఉత్పత్తుల గురించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈ క్రమంలో గతేడాది భారీ వర్షాల వల్ల పార్కు స్థలంలో 300 ఎకరాలు ముంపునకు గురై కైటెక్స్ కంపెనీ నిర్మాణ పనులు నిలిచిపోయాయని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధి మనోజ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం వరద ముంపును నివారించేందుకు 10 ఎకరాల్లో పాండ్‌ను నిర్మించి అందులోని నీటిని పరిశ్రమలకు ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో పాండ్‌లో ఎక్కువైన నీటిని కాలువ ద్వారా సమీప చెరువులోకి పంపించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు నీటి సరఫరా, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులతో వంద గజాల ప్లాట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల సబ్సిడీని కూడా అందించాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. అలా భూ నిర్వాసితులకు నిర్మించే కాలనీని మేజర్ గ్రామపంచాయతీగా గుర్తించి అన్ని వసతులను కల్పించాలన్నారు. భూ నిర్వాసితులకు ఇప్పటి వరకు 1200 ప్లాట్లు ఏర్పాటు చేశామని.. ఇంకా 150 మందికి ఇవ్వాల్సిన ప్లాట్లను ఫైలాన్ వద్ద సిద్ధం చేస్తున్నట్లు టీజీఐఐసీ అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం 2గంటలకు ఎగ్జిబిషన్ హాల్ నుంచి బయటకు వచ్చిన సీఎంను కలిసేందుకు కాంగ్రెస్ నాయకులు పోటీపడ్డారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతు, సీఎంవో స్పెషల్ సెక్రటరీ అజిత్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంపీపీలు భీమగాని సౌజన్య, కళావతి, సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


మొక్కనాటుతున్న రేవంత్

మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం


సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్, డైరెక్టర్ అనిల్‌కృష్ణ

బాలసముద్రం, జూన్ 29: వరంగల్ నగరంలో అత్యాధునిక వసతులతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మెడికవర్ సూపర్ మల్టీ స్పెషాలిటీ 300 పడకల ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ అత్యంత హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపుపొందిన మెడికవర్ ఆస్పత్రి 24వ బ్రాంచ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. సువిశాలమైన భవనంలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో వైద్య పరికరాలను సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శరత్‌రెడ్డి, హరికృష్ణలు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ ఆస్పత్రి చైన్‌గా 24 ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ ఆస్పత్రి.. లక్షల మందికి వైద్య సేవలందించిందన్నారు. కరోనా సమయంలో లక్షలాది మందికి ఉచితంగా వ్యాక్సినేషన్ అందించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మెడికవర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు మెడికవర్ కలిసి పనిచేస్తుందని అన్నారు. వరంగల్‌లో 300 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 7 ఆపరేషన్ థియేటర్స్‌తో పాటు ఎక్కువ సంఖ్యలో ఐసీయూ బెడ్స్ ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు నగర ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వరంగల్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మెడికవర్ హాస్పిటల్ వరంగల్ నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం

హనుమకొండ కలెక్టరేట్, జూన్29: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ఇటీవ ల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మెప్మా ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం సభ్యులు సొంతంగా తయారుచేసిన పిండి వంటలను సీఎం రుచి చూసి అభినందించారు. మహిళా సం ఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. సీఎం వెంట మంత్రులు కోమటిరెడ్డి రాజగో పాల్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

కుట్టుమిషన్ స్టాల్‌ను సందర్శించిన సీఎం

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం కింద మహి ళా సంఘాలకు కుట్టుమిషన్లు ఇచ్చారు. ఈ మహిళా సంఘా ల సభ్యులు శనివారం కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి స్టాల్‌ను సందర్శించి మహిళలతో మాట్లా డారు. యూనిఫాంలు కుట్టడంలో ఏమైనా ఇబ్బందులు ఎదు రయ్యాయా? మీరు ఎంతమందికి యూనిఫామ్స్ కుట్టారు? ఎలా అనిపించింది? దీనివల్ల లాభం ఉందా? ఆర్థికంగా నిల దొక్కుకున్నారా? ఎవరెవరు ఎన్ని కుట్టారు? అని సభ్యులతో సీఎం మాట్లాడారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీఓలు నాగ పద్మజ, కౌసల్యదేవి డీపీఎంలు జె.ప్రకాశ్, ఎం.అనిల్, ఎ.శ్రీకాంత్ కార్యక్రమంలో ఉన్నారు.


కుట్టుమిషన్ కేంద్రంలో మహిళలతో ముచ్చటిస్తూ..

సీఎం పర్యటన సాగిందిలా..

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 29: వరంగల్ మహానగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేయడానికి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1:16నిమిషాలకు వరంగల్ జిల్లా సంగెం మండలంలోని టెక్స్‌టైల్‌పార్కుకు చేరుకున్నారు. అక్కడ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అక్కడి నుంచి 2:02 నిమిషాల కు బయలుదేరి 2:37 నిమిషాలకు వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఆస్పత్రిని పరిశీలించి 2:52 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరి 3:04 నిమిషాలకు హనుమకొండలోని కలె క్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 6:18 నిమిషాలకు బయలుదేరి హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రికి 6:24నిమిషాలకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఆస్పత్రిని ప్రారంభిం చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడి సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి అక్కడి నుండి 7:12 నిమిషాలకు వెళ్లిపోయారు.

అంచనా వ్యయం పెంపుపై సీఎం ఆగ్రహం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పరిశీలించిన సీఎం


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

వరంగల్ మెడికల్, జూన్ 29: వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం విషయంలో రూ.1100కోట్లున్న అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,726 కోట్లకు ఇష్టారాజ్యంగా ఎలా పెంచారని, కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందే నని నిర్మాణం సంస్థకు సీఎం తేల్చిచెప్పారు. ఆస్పత్రి అంతస్తుల వివరాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ సీఎంకు వివరించారు. ఒకటి నుంచి 15 అంతస్తులు చికిత్స కోసమని, ఇందులో మూడు, నాలుగు ఫ్లోర్లు థియేటర్లు ఉంటాయని వివరించారు. అదే విధంగా 12, 13 ఫ్లోర్లలో లేబరోటరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16, 17, 18 ఫ్లోర్లలో అకడమిక్ కార్యక్రమాలు కొనసాగుతాయని, 20, 21 ఫ్లోర్లలో సీనియర్ రెసిడెంట్లు ఉంటారని, 23వ ఫ్లోర్‌లో పరిపాలన భవనం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు లోబడి నిర్మాణం జరుగుతుందని, కాకతీయ వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీలో ప్రస్తుతం తొమ్మిది విభాగాల్లో ఐదు విభాగాలు కొత్త బ్లాక్‌లోకి వస్తాయని సీఎంకు తెలిపారు. సీఎం అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ నూతన ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ జెనెటిక్స్, జీడియాట్రిక్స్, రుమటాలజీ, సర్జికల్ ఆంకాలజీ లాంటి ఎనిమిది కొత్త విభాగాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో పీడియాట్రిక్ విభాగంతో పాటు మాతాశిశు సంరక్షణ విభాగం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, రెవెన్యూ శాఖ మంత్రి పి.శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి.. మాస్టర్ ప్లాన్..


సమీక్షకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

(5వ పేజీ తరువాయి)

సూచించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంపై డిటెల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం కురిసినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల అంచనాల వ్యయం ఎందుకు పెరిగిందని అధికారులను ప్రశ్నించారు. ఈపీసీ పద్ధతిన పనులు చేపడుతున్నందు వల్ల ఇలా పెంచే వీలు లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల విలువ పెంపు అంచనాల పెంపుపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

సమగ్ర వివరాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలి

2050 సంవత్సరం వరకు వరంగల్ అభివృద్ధికి సరిపడేలా సమగ్రమైన వివరాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. వరంగల్‌లో హైదరాబాద్‌లో ఉన్న నిలోఫర్ ఆస్పత్రి తరహాలో అన్ని హంగులతో ఓ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ వెంటనే చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందో లేదో తెలుసుకోవాలన్నారు. అలాగే సెప్టెంబర్ 9 నాటికి కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అధికారులను హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో ఆపరేషన్లు, ఇతర వైద్య సేవలకు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌వోసీ ఇచ్చే అంశంపై పరిశీలన జరుపుతామన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామని, స్వశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ పేర్కొన్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫారంకు సంబంధించిన పెండింగ్ బిల్స్ ఉంటే వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉందని, ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో వరంగల్ అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని వివరాలతో కూడిన ఒక ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధికి రూ.6,115 కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా గుర్తించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని, సుపరిపాలన అందించితీరుతామని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ నగరాభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారసత్వ వరంగా వరంగల్ నగరానికి గొప్పపేరుందని గుర్తు చేశారు. సమర్థత ఆధారంగానే బదిలీలు నిర్వహిస్తామన్నారు. రాజకీయ ప్రేరేపిత బదిలీలు ఉండబోవని స్పష్టం చేశారు. అధికారులు భయపడాల్సి అవసరం లేదని, ఎవరి పనివారు చేసుకుంటూ ముందుకు సాగాలని హితవు పలికారు. ప్రస్తుతం తాను సమీక్షను ప్రాథమికంగానే నిర్వహించానని, 45 రోజుల తర్వాత వచ్చి పూర్తి స్థాయిలో మరో సారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని చెప్పారు.

రింగ్‌రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు : పొంగులేటి

రింగ్ రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అంచనా వ్యయం పెరగడంపై లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ఆస్పత్రి ద్వారా వెంటనే వైద్యసేవల అందుబాటులో వచ్చేలా చూస్తామన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మట్లాడుతూ.. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూపొందించిన మాస్టర్ ప్లాన్ సరిగా లేదని, మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్ సమగ్రాభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించడానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు జాతీయ రహదారుల అనుసంధానం సాధ్యాసాధ్యాల గురించి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు పాటిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చిన ప్రతీ అంశాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తామన్నారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని, మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి భూసేకరణ పనులను త్వరలో చేపడతామని చెప్పారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ. 518.71 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామచంద్రునాయక్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్, ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశస్విని రెడ్డి, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణం చెల్లించలేక..
వ్యక్తి ఆత్మహత్య

- ఖమ్మం జిల్లా కేంద్రంలో ఘటన
- మృతుడు మరిపెడ వాసి


శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ఖమ్మం క్రైం, జూన్ 29 : 'అమ్మా నన్ను క్షమించు.. నిన్ను చూసుకోకుండానే నాన్న వద్దకు వెళుతున్నాను. వ్యాపారం కోసం తీసుకున్న అప్పులు చెల్లించలేకపోతున్నాను. మీరెన్ని సార్లు వద్దని చెప్పినా వినకుండా అప్పు తీసుకున్నాను. ఇప్పుడవి చెల్లించలేకమీకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే దూరమవుతున్నాను.. నా కుమారుడు నవీన్‌రెడ్డిని మంచిగా చూసుకోండి.. బాగా చదివించి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వరకు కుటుంబసభ్యులందరు సహాయం చేయండి.. ఇకనేను వెళ్లిపోతున్నా. నేను తీసుకున్న లోన్లకు అప్పులకు అన్నింటికి నేనే బాధ్యుడిని.. నా కుటుంబసభ్యులకు ఎటువంటిసంబంధం లేదంటూ' ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.

మహబూబాద్ జిల్లా మరిపెడకు చెందిన యరసాని శ్రీనివాసరెడ్డి (38)అనేవ్యక్తి ప్రైవేట్ వ్యాపారం చేస్తుంటాడు. గతంలో ఖమ్మంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ ఏదులాపురంలో నివాసం ఉన్నాడు. ఆతర్వాత ప్రైవేటు వ్యాపారం చేసుకుంటూ కొంతకాలంగా మిర్యాలగూడలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. కొంతకాలం క్రితం ప్రైవేట్ యాప్‌లు, బ్యాంక్‌లు, క్రెడిట్ యాప్‌లలో వ్యాపారం కోసం లోన్లు తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో తిసుకున్న అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపధ్యంలో శుక్రవారం సాయంత్రం మిర్యాలగూడలోని తన నివాసంలో మొబైల్ ఫోన్‌ను పెట్టి ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వచ్చి నగరంలోని ఓలాడ్జ్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో లాడ్జ్ సిబ్బంది తలుపుకొట్టగా తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్సై రఫి సంఘటన స్థలం వద్దకు వెళ్ళి గది తలుపును పగలగొట్టి చూడగా శ్రీనివాసరెడ్డి ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. తర్వాత గదిని పరిశీలించగా అప్పుల కట్టలేక సూసైడ్ చెసుకుంటున్నా అని లెటర్ రాసి ఉంది. దీంతో అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

జిల్లాలో 7.9 మి.మీ వర్షపాతం నమోదు

మహబూబాబాద్ టౌన్, జూన్ 29 : శుక్రవారం రాత్రి కురిసిన చిరుజల్లులకు జిల్లాలో 126.6 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, 7.9 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గూడూరులో అత్యధికంగా 24.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పెద్ద వంగరలో 1.4 మి.మీ నమోదైంది. కొత్తగూడలో 17.8, గంగారంలో 22.4, గార్లలో 4.2, డోర్నకల్‌లో 1.8, కురవిలో 2.6, మహబూబాబాద్‌లో 1.4, కేసముద్రంలో 8.0, నెల్లికుదురులో 8.2, నర్సింహులపేటలో 5.4, చిన్నగూడూరులో 6.8, మరిపెడలో 12.4, దంతాలపల్లిలో 4.8, తొర్రూరులో 5.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

2న రైతులకు సమావేశం

నెల్లికుదురు, జూన్ 29 : జులై 2న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ కాసం లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పీఏసీఎస్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం నెల్లికుదురులోని రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల్లికుదురు పీఏసీఎస్ పరిధిలోని 5 గ్రామపంచాయితీలకు చెందిన రైతులు హాజరు కావాలని కోరారు.

'ఏకలవ్య'లో ఉద్యోగాలకు భద్రత కల్పించాలి

- కలెక్టర్‌కు ఈఎంఆర్ఎస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విజ్ఞప్తి


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఈఎంఆర్ఎస్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 29 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (ఈఎంఆర్ఎస్)ల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నాలుగైదు సంవత్సరాలుగా పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని ఈఎంఆర్ఎస్ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సలీం పాష, ఉమాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు రెగ్యులర్ ఉపాధ్యాయులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆ పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 500 మంది ఉద్యోగులు ఉపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకలవ్య పాఠశాలలన్ని కేంద్రప్రభుత్వ ఆధీనంలో పని చేస్తున్నాయని, అయినప్పటికి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం అమలవుతుందని తెలిపారు. కొత్తగూడ, సీరోలు, గూడూరు, కురవి, బయ్యారం మండలాల్లోని ఐదు ఏకలవ్య పాఠశాలల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు పోగా మిగిలిన ఖాళీలను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సర్దుబాటు చేయాలని లేనిపక్షంలో ఇతర సొసైటీ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, అశోక్, యాకయ్య, సిరి, సురేష్, సదానందం, స్వప్న, హేమా, రాజు, ప్రవీణ్, రమేష్, మహేష్, శ్రీను, రఘువీర్ పాల్గొన్నారు.

నారాయణపురం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలని సీఎంకు వినతి

కేసముద్రం, జూన్ 29 : మండలంలోని నారాయణపురంలో 700 ఎకరాల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాపాస్ పుస్తకాలివ్వాలని కోరుతూ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి అన్నారపు యాకయ్య కోరారు. ఈ మేరకు హన్మకొండకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 1,417 ఎకరాల్లో మూడేళ్ల క్రితం ఆరు బృందాలతో సర్వే నిర్వహించి కొంత మంది రైతులకు పట్టాలను జారీ చేశారని తెలిపారు. మిగిలిన సుమారు 700 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలులేక రైతుబంధు, రైతుబీమా, ఇతర పథకాలకు రైతులు దూరమయ్యారని అన్నారు. ఇప్పటికైనా పట్టాపాస్‌పుస్తకాలను వెంటనే ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అమనగల్‌లో హెల్త్ క్యాంప్

మహబూబాబాద్ రూరల్, జూన్ 29 : అమనగల్‌లో మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు శనివారం ఇంటింటా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సుమారు 75 మంది మెడికల్ విద్యార్థినీ విద్యార్థులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కబ్జాదారులపై చర్య తీసుకోవాలి'

నెల్లికుదురు, జూన్ 29 : రత్తిరాంతండా శివారు కునాయికుంట భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు గుగులోత్ రామునాయక్ తెలిపారు. నెల్లికుదురు మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు నీరందించే సుమారు 20 ఎకరాల కునాయికుంటను ఆక్రమించడానికి రియల్‌ఎస్టేట్ దళారులు చూస్తున్నారని, అధికారులు స్పందించి వెంటనే వారిపై చర్యలు తీసుకొని కునాయి కుంట భూమిని కాపాడాలన్నారు. కుంటభూమి ఆక్రమిస్తే తండావాసులతో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ఒక్కో విద్యార్థిని దత్తత తీసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు


ఇంటికన్నె జడ్పీహైస్కూల్లో విద్యార్థులను ప్రశ్నిస్తున్న రామారావు

కేసముద్రం, జూన్ 29 : జడ్పీహైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థిని దత్తత తీసుకొని, వారికి ప్రత్యేక శిక్షణనిచ్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రామారావు సూచించారు. ఇంటికన్నె హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను శనివారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో సాధించిన గ్రేడింగ్‌ల తోపాటు ఒక్కో విద్యార్థిని డీఈవో స్వయంగా ప్రశ్నించి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎం శారదబాయి, రాపోలు యాకయ్య, సూర సుజాత, కస్తూరి శ్రీహరి, జి.శ్రీనివాస్, పీఎస్ హెచ్ఎం హోంజి ఉన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలి..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : జిల్లాలోప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో చదువుకునే వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ ఇచ్చిన విజ్ఞాపన పరిగణలోకి తీసుకుని ఫీజుల్లో సాధ్యమైనంత వరకు విద్యార్థులకు రాయితీ కల్పించాలని పేర్కొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి


నాగన్న (ఫైల్)

తొర్రూరు, జూన్ 29 : లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన శని వారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. నెల్లికుదురు మండల నైనాలకు చెందిన నంగునూరి నాగన్న (62) తొర్రూరు లో తన కూతురు ఇంటివద్ద నివాసం ఉంటున్నాడు. మందులు కొనుగోలు చేసేందుకు మెడికల్ షాపుకు వెళ్లి తిరిగిరోడ్డు దాటుతుండగా బస్టాండ్ సెంటర్‌లో ఏపీ37 టీసీ 9549 లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి అల్లుడు అనారోగ్యంతో మూడునెలల క్రితం మృతి చెందాడు. బిడ్డను ఓదార్చేందుకు ఇక్కడే ఉంటున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : యువకుడికి గాయాలు

కేసముద్రం, జూన్ 29 : కేసముద్రం-మహబూబాబాద్ రహదారిలో పెనుగొండ క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం కారు అదుపు తప్పి ఉప్పరపల్లికి చెందిన యజమాని, డ్రైవర్ బిజిగ సందీప్‌కు గాయాలయ్యాయి. మూల మలుపు వద్ద కారువేగంగా చెల్కల్లోకి దూసుకెళ్లడంతో సందీప్‌కు గాయాల య్యాయి. 108లో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో విజిలెన్స్ తనిఖీలు?

కేసముద్రం, జూన్29 : కేసముద్రం మార్కెట్ ఆవరణలోని మండల్ లెవల్‌స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ మేరకు సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కృష్ణవేణి ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించారు. డీఎం మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులు సాధారణ తనిఖీలు నిర్వహించారని, తాను కూడా సాధారణ తనిఖీల్లో భాగంగానే వచ్చినట్లు వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


బాలు

నెల్లికుదురు, జూన్ 29 : అప్పుల బాధతో ఓరైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బోడ్యతండాలో శనివారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోడ్యతండాకు చెందిన బానోతు బాలు (50)కు మూడెకరాల వ్యసాయ భూమిఉంది. ఆ భూమిలో రూ. 2లక్షలు అప్పుచేసి, బావి తవ్వించాడు. గతంలో రెండెకరాలలో మిరపపంట సాగుచేయగా, నష్టం వచ్చింది. పెట్టుబడి కోసం రూ.3లక్షలు అప్పు చేశాడు. దీంతో 20 గుంటల వ్యసాభూమి అమ్మి వడ్డీలు చెల్లించాడు. ఇంకా రూ.5 లక్షల అప్పు ఎలా తీర్చాలని మనస్తాపంచెంది శుక్రవారం తన వ్యసాయ భూమివద్ద బాలు పురుగుల మందు తాగాడు. గమనించిన తండావాసులు ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య దామ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించిట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కోన్నారు.

దడువాయిలను ఉద్యోగులుగా గుర్తించాలి

- మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 29 : వ్యవసాయ మార్కెట్‌లలో పనిచేస్తున్న దడువాయిలను మార్కెట్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ దడువాయిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఖమ్మంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ల ఆవిర్భావం నుంచి మార్కెట్లలో రైతులకు వేయింగ్‌మిషన్ల ద్వారా తూకం వేసి చిట్టా రైతులకు ఇవ్వడం, ఈనామ్ పద్ధతిలో జరిగే వేయింగ్ మిషన్ల ద్వారా రైతుల సరుకులకు తూకం వేయడం జరుగుతుందన్నారు. ఎండనక, వాననక ప్రభుత్వ రంగసంస్థల కొనుగోలు కేంద్రాల్లో కూడ కాంటాలు నిర్వహించడం జరుగుతుందని, దుమ్ముధూళిలో పని చేస్తున్నామని, తమను మార్కెట్ ఉద్యోగులుగా గుర్తించి, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి బోనాల వీరన్న, ఉపాధ్యక్షుడు నీలం రాజేష్, సహాయ కార్యదర్శి రవి, వరంగల్ ఏనుమాముల మార్కెట్ దడువాయిల సంఘం అధ్యక్షుడు దేవేందర్ పాల్గొన్నారు.


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి తమ సమస్యలను వివరిస్తున్న మార్కెట్ దడువాయిల సంఘం నేతలు

విద్యుత్ ఇంజనీర్లపై ఎంపీపీ, జడ్పీటీసీ ఆగ్రహం


విద్యుత్ ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ శారద

మరిపెడ, జూన్ 29 : విద్యుత్ ఇంజనీర్లపై ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మరిపెడ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరుణ అధ్యక్షతన జరిగింది. మండలంలోని తానంచర్ల రెవెన్యూ పరిధి ఓ తండాలో విద్యుత్ షాక్‌తో ఇళ్ల దగ్ధమై రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగిన విద్యుత్ ఏఈలకు గింత పట్టింపులేదని జడ్పీటీసీ శారద ట్రాన్స్‌కో ఏఈలను ప్రశ్నించారు. వేసవిలో గాలిదుమారానికి తీగలు తెగిపడ్డ ట్రాన్స్‌కో సిబ్బంది పట్టింపులేక గాలివారిగూడెంలో పలు పశువులు మృతి చెందిన విషయాన్ని ఎంపీపీ గుర్తుచేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పలు గ్రామాలకు చెందిన స్పెషల్ ఆఫీసర్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా పని తీరు మెరుగుపర్చుకోవాలన్నారు. మరిపెడ వందపడకల ఆస్పత్రి పనుల జాడలేదని మెడికల్ ఆఫీసర్‌ను వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి అడిగారు. ప్రభుత్వ ప్రాసెస్‌లో ఉందని డాక్టర్ రవి సభ్యులకు వివరించారు. వ్యవసాయ, వెటర్నరీ, ఆరోగ్య, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ తదితర శాఖలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గద్దె రేవతి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండల్ పరిషత్ సూపరింటెండెంట్ శేషశయనం రిటైర్మెంట్ కాగా, ఆయనను ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తాళ్లపెల్లి రఘు, అధికారులు సత్కరించారు. శేషశయనం కుటుంబసభ్యులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : డీఈ

గూడూరు, జూన్ 29 : వర్షాకాలంలో 33కేవీ/11 కేవీ, నియంత్రణ, మెయింటెనెన్స్ పనుల నిర్వహణ చేసేటప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ విద్యుత్ శాఖ డీఈ పెరుమాళ్లపెల్లి విజయ్‌కుమార్ అన్నారు. గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని అయోధ్యపురం సెక్షన్ విద్యుత్ సిబ్బంది సమావేశం ఏడీఈ కవిత అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో చేపట్టే పనుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లూజులైన్లు, పక్కకు ఒరిగిన విద్యుత్ పోల్స్‌ను సరిచేయాలన్నారు. మండల పరిధిలో 142 పక్కకు ఒరిగిన విద్యుత్ పోల్స్‌ను సరిచేయడం జరిగిందన్నారు. 200 మేర లూజుగా ఉన్న విద్యుత్ తీగల లైన్‌లను సవరించినట్లు చెప్పారు. వర్షాకాలంలో ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు ఎవరూ సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టకూడదని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఈలు ప్రణయ్, అమ్ములు, సబ్ ఇంజనీర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డీఈ విజయ్‌కుమార్

టీపీసీసీ అధ్యక్ష పదవి బలరాంకే ఇవ్వాలి

నెహ్రూసెంటర్, జూన్ 29 : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంపీ పోరిక బలరాంనాయక్‌కే ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి శనివారం విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయగల సత్తా పోరిక బలరాంనాయక్‌కు ఉందని స్పష్టం చేశారు. బానోత్ విష్ణునాయక్, బానోత్ రాందాస్‌నాయక్, గుగులోతు మంగీలాల్‌నాయక్, శ్రీనునాయక్, వీరన్ననాయక్, సంపత్, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

'కిషన్‌నాయక్ ఆదర్శనీయుడు'


కిషన్‌నాయక్-లక్ష్మీ దంపతులను సన్మానిస్తున్న ప్రముఖులు, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 29 : ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన నాటినుంచి వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధునేర్పి, వారి మన్ననలు పొందిన ఉపాధ్యా యుడు గుగులోతు కిషన్‌నాయక్ అందరికి ఆదర్శనీయమని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకట్రాములు అన్నారు. జమాండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యా యుడిగా విధులు నిర్వహించిన కిషన్‌నాయక్ ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమాన్ని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వ హించారు. ఈ కార్య క్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కిషన్ నాయక్-లక్ష్మీ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐఎంఏ)జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, డీఈవో రామారావు ఎంఈవో పూల్‌చంద్, ఏసీజీ ఈ మందుల శ్రీరాములు, ఎంఎన్‌వో వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్దన్. ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ విజయ, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుగులోతు విజయ, బంధువులు శారదామోహన్, తారాచంద్, వెన్నెల, సోనూ, రవితేజ, కైకాబాయి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 29 : హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం జూలై 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు 20 మంది బాలురు. 20 మంది బాలికలు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అధికారి బాలగాని అనిల్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం జిల్లాస్థాయి స్పోర్ట్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా బాలురు 38, బాలికలు 32 మంది పోటీలో పాల్గొన్నారు. ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ, వర్టికల్‌జంప్, బ్రాడ్‌జంప్, మెడిసిన్‌బాల్‌త్రో, షటిల్‌రన్, 30 మీటర్ల స్పీడ్‌రన్, 800 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించి, వాటిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలుర నుంచి 20, బాలికల నుంచి 20 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డీవైఎస్వో అనిల్‌కుమార్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలను బాస్కెట్ బాల్‌కోచ్ వెలిశాల కుమారస్వామి, ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ జ్యోతి, పీడీలు పద్మావతి, పుష్పలీల, శంకర్‌నాయక్, చాంప్లానాయక్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, విజయ్‌చందర్, కమల్‌కిషోర్, సునిత, వీరభద్రం, సింధువర్మ, సునిల్ నిర్వహించారు.

పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి

కురవి, జూన్29 : ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో అనేక పొరపాట్లు జరిగాయని, అటువంటి పొరపాట్లు పునరావృతం కాకుండ చూడాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. కురవి మండలం రాజోలు జడ్పీహెచ్ఎస్‌లో టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పక్బడందీగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఎస్‌జీటీలు అధిక సంఖ్యలో ఉండడం వల్ల వెబ్ ఆప్షన్స్‌కు అధిక సమయం ఇవ్వాలని కోరారు. ఎం. ప్రవీన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాజశేఖర్, ఎ.మురళీకృష్ణ, ఎస్‌కె.యాకూబ్, హెచ్ఎం ఆళ్ల రవి, జి.బాలునాయక్, బాలరాజు, సురేష్, అనిల్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

- కాంగ్రెస్ తొర్రూరు మండల అధ్యక్షుడు అధ్యక్షుడు సంతోష్

తొర్రూరు రూరల్, జూన్ 29 : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. శనివారం అమర్‌సింగ్‌తండా స్థానిక నాయకులతో కలసి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు హపావత్ గోపినాయక్, మాజీ ఎంపీటీసీ జాటోతు నాను, మాజీ సర్పంచ్ హపావత్ సురేష్ నాయక్, నాయకులు హపావత్ సురేందర్, బిచ్చా, రమేష్, మోహన్, సుందర్, దంజి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

పెద్దవంగర, జూన్ 29 : విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న అన్నారు. శనివారం చిన్నవంగర గ్రామంలోని కేజీబీవీ, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆకస్మకంగా తనిఖీ చేసి వంటశాల, తరగతి గదులను, రికార్డులను పరిశీలించారు. ఎంపీటీసీ మెట్టు సౌజన్య, ఎస్‌వో స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

తొర్రూరు, జూన్ 29 : రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. నాయకులు రవి, తిరుమల్ రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ ప్రసాద్

తొర్రూరు, జూన్ 29 : పట్టణంలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో చేపడుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఉండని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్, ఏఈ రంజిత్, ఖురేష్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

సారా వద్దు.. చదువే ముద్దు : ఎస్పీ


పూనుగొండ్లలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

గంగారం, జూన్ 29 : సారా వద్దు.. చదువే ముద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. గంగారం మండలంలో శనివారం ఎస్పీ విస్తృత పర్యటన చేశారు. సారా తయారు చేసి విక్రయించే జంగాలపల్లిలో ఉదయం ఆరు గంటలకే కార్డెన్ చర్చ్ నిర్వహించి, ఐదువందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. సారా తయారుకు ఉపయోగించే పరికారలను ధ్వంసం చేశారు. అనంతరం యువతతో ఆయన మాట్లాడిమద్యం తయారు చేయమని, మద్యం మానేస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం కాటినాగారం, పెద్దెల్లాపూర్, కామారం, మద్రిగూడెం గ్రామాలలో పర్యటించిన అనంతరం పూనుగొండ్లలోనద పగిడిద్దరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామసభలో మాట్లాడారు. చిన్నారులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్స్, స్కూలు బ్యాగులు ఉచింతగా పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్, నెట్ అందచేశారు. యువత కష్టపడి చదివి ఉన్నత పదవుల్లో ఉండాలని కోరారు. అనంతరం గ్రామ మహిళలతో ప్రత్యే సమావేశం నిర్వహించారు. మహిళలు చైతన్య వంతులైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో మద్యం నిషేదం అమలు జరగాలంటే మహిళలు నడుంబిగించి పని చేయాలన్నారు. పట్టణాలకు పల్లేలే పట్టుకొమ్మలని గ్రామ స్థాయిలో గుడుంబా ను తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరిపతిరావు, ఆర్‌డీఎస్పీ శ్రీనివాస్, గూడూరు సీఐ బాబూరావు, మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య గంగారం ఎస్ఐ రవికుమార్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములపై సర్వే

డోర్నకల్, జూన్ 29 : మునిసిపల్ కేంద్రంలో వక్ఫ్‌బోర్డు భూములపై శనివారం సర్వే నిర్వహించారు. సర్వే నెంబర్ 135,136,137, సర్వే నెంబర్ 3లో వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములు అన్యాక్రాంతమైనట్లు డోర్నకల్‌కు చెందిన వక్ఫ్‌ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు అఖిలుల్లా హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు వక్ఫబోర్డు భూముల సర్వే చేపట్టారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ జమీరుద్దీన్, డీఐ సర్వేయర్ దత్తు, డోర్నకల్ సర్వేయర్ వెంకన్న, వక్ఫ్‌బోర్డు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సలీమ్, వక్ఫ్‌బోర్డు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుజాత్‌అలీ, సయ్యద్ అక్బర్, శాషావలిలు పాల్గొన్నారు. నివేదికనుఉన్నతాధికారులకు అందించనున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా ఎస్ఈ పదవీ విరమణ వీడ్కోలు


పదవీ విరమణ పొందిన సురేష్ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, జూన్29 : జిల్లా పంచాయతీ రాజ్ శాఖ సూపరిం టెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) కొరిచెర్ల సురేష్ పదవీ విరమణ వీడ్కోలు సభ హనుమకొండలోని మయూరి గార్డెన్స్‌లో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్, అనురాధ దంపతులను అధికారులు, ఉద్యోగ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు శాలువాలతో సత్కరించి పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇంజనీర్ ఇన్‌చీఫ్ వి.కనకరత్నం, పీఆర్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, మహబూబాబాద్ ఏస్ఈ ఎస్.రాంకోటినాయక్, వివిధ జిల్లాల ఎస్ఈలు ఎ.శ్రీనివాసులు, కె.రఘువీరారెడ్డి, వి.అజయ్‌కుమార్, జి.శంకరయ్య, డి.ఇజ్జగిరి, ఆర్.చంద్రశేఖర్, ఎస్.దిలీప్‌కుమార్‌తో పాటు హన్మకొండ ఏకశిల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు, జూన్ 29 : గాజులగట్టులో ఆరె కొమురయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వేర్వేరుగా శనివారం కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన కుమారుడు గూడూరు వైస్ ఎంపీపీ ఆరె వీరన్నను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్నగౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌పాషా, నూకల సురేందర్, కటార్‌సింగ్, రహీంపాష, ఎదునూరి వెంకన్న, వల్లెపు శ్రీనివాస్, చాగంటి భీముడు, మల్లయ్య, నాయిని ఐలయ్య, దేవేందర్, బోడ వీరన్న, వాంకుడోతు వెంకన్న, మద్నానాయక్, సంపత్‌రావు, సోమునాయక్, సుధాకర్ రావు, మూడు మోహన్, పొన్నాల యుగేందర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఇనుగుర్తి, జూన్ 29 : మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన మలిశెట్టి శ్యామ్ తండ్రి మలిశెట్టి సోమయ్య శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అయ్యగారిపల్లికి చేరుకుని సోమయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సోమయ్య కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు దస్రునాయక్, ఘనపురపు అంజయ్య, మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, అల్లం నాగేశ్వర్‌రావు, గుజ్జునూరి బాబురావు, చిన్నాల కట్టయ్య, మీట్యనాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పదు

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


షేక్.ఆహ్మద్ దంపతులకు మెమోంటో అందించి శాలువాతో సత్కరిస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 29 : ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పదని, విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పీసీఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న షేక్.ఆహ్మద్ శనివారం పదవీవిరమణ పొందారు. పదవీవిరమణ సందర్భంగా షేక్.ఆహ్మద్ దంపతులకు ఎస్పీ మోమెంటో అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి.. ఇటీవలనే ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందారని, ఆహ్మద్ శేషజీవితాన్ని ఆనందంగా గడుపాలని కోరారు.

●మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న డి.కుమారస్వామి పదవీవిరమణ పొందారు. ఎస్పీ కార్యాలయంలో కుమారస్వామి దంపతులకు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మెమోంటో అందించి, శాలువతో ఘనంగా సత్కరించారు. డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సై దీపికరెడ్డి పాల్గొన్నారు.

నాలుగు ఇసుక డంప్‌లు సీజ్

దంతాలపల్లి, జూన్ 29 : మండలంలోని పెద్దముప్పారం పాలేరు వాగు శివారులో అక్రమంగా ఏర్పాటు చేసిన నాలుగు ఇసుక డంప్‌లను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా గిర్దావర్ నజీముద్దిన్ మాట్లాడుతూ గత వారం క్రితం గుర్తు తెలియని వ్యక్తులు స్వలాభం కోసం పాలేరు ఇసుకను నాలుగుచోట్ల డంప్ చేశారన్నారు. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో సుమారు 25 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశామన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్సై కరుణాకర్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

డోర్నకల్, జూన్ 29 : తహసీల్దార్ బంజరకు చెందిన సామల విజయలక్ష్మి ఆత్మహత్య కేసులో ఆమెచిన్న కొడుకు శ్రీకాంత్‌రెడ్డి, కోడలు నాగమణిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. సామల విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు సంతానం. విజయలక్ష్మి బాగోగులు చూసుకోవాల్సిన చిన్న కొడుకు- కోడలు ఆమెను మానసికంగా దూషించి హింసించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో కోపోద్రికులైన చిన్నకొడుకు, కోడలు ఆమెను మందలించడంతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి గత ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌రెడ్డి-నాగమణిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.